సాక్షి
మెదక్

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023




వన్యప్రాణుల విలవిల
ఈవేసవిలో వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే విషయమై ఆశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఫలితంగా గుక్కెడు నీటి కోసం అవి అలమటిస్తున్నాయి. 8లో

విజిలెన్స్ దాడులు
పేదలకు పంపిణీ కావాల్సిన రేషన్ బియ్యం నిల్వల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్టు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. 8లో





అన్ని మతాలకు ప్రాధాన్యం
తెలంగాణ వచ్చాక అన్ని మతాలకు ప్రాధాన్యం లభిస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శనివారం ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. 9లో



అకాల వర్షం..

అన్నదాత ఆగమాగం



చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం



కోతకు సిద్ధంగా వరి

అకాల వర్షం అన్నదాతను అతలాకుతలం చేసింది. జిల్లాలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులకు వరి నేలవాలి వడ్లు రాలిపోగా.. పంట పొలాల్లో నీరు నిల్వడంతో పంట కోయిలేని పరిస్థితి ఏర్పడింది.

- మెదక్‌జోన్

జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో 2.10 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటికే వరికోతలు ప్రారంభించి రోడ్లపై ధాన్యం ఆరబెట్టారు. శనివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయింది. చిన్నశంకరంపేట, రామాయంపేట, చేగుంట, పాపన్నపేట మండలాల్లో వర్షంతో పంటలకు అధిక నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోతకు వచ్చిన వరి వడ్లు రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రామాయంపేట మండలంలో అత్యధికంగా వడ్లు రాలిపోగా, ఈదురుగాలులకు పాపన్నపేట మండలంలో ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి, విద్యుత్ స్తంభాలు కూలి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఇది రెండోసారి..

ఈయాసంగిలో అకాల వర్షాలతో అన్నదాతలకు నష్టం జరుగుతూనే ఉంది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసి ఇప్పటికీ రెండోసారి తీవ్ర నష్టం జరిగింది. మార్చి 19వ తేదీన కురిసిన భారీ వర్షానికి జిల్లావ్యాప్తంగా వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలకు నష్టం జరగగా.. అధికారులు మాత్రం కేవలం 89 ఎకరాల్లో మాత్రమే పంటలు దెబ్బతినట్టు ప్రతిపాదనలు పంపారు. శనివారం రెండోసారి ఈదురుగాలులతో కూడిన వర్షానికి కోతకు వచ్చిన వరి పంటలకు నష్టం వాటిల్లింది. అకాల వర్షాలతో ఇప్పటికే రెండుసార్లు పంటలు దెబ్బతినడంతో రైతులు కోలుకోలేకపోతున్నారు. జరిగిన నష్టాన్ని సైతం అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంటనష్టం జరిగిన పొలాలను పరిశీలించి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పనుల్లో జాప్యం ఎందుకు?



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

అధికారులపై కలెక్టర్ రాజర్షిషా ఆగ్రహం

మెదక్ కలెక్టరేట్: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించడంలో ఎందుకు జాప్యం జరుగుతుందని అధికారులపై కలెక్టర్ రాజర్షిషా మండిపడ్డారు. మెదక్ పట్టణ శివారులోని పిల్లికోటాల్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను శనివారం కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా మిగిలిపోయిన చిన్న చిన్న పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, ఏజెన్సీలకు సూచించారు. ఇందుకు సంబంధించి అవసరమైన పరిపాలన అనుమతులు వెంటనే మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఇంటి దగ్గర పూలు, నీడనిచ్చే మొక్కలు నాటేలా చూడాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. క్రీడా మైదానం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. లబ్ధిదారులకు అందుబాటులో నూతనంగా రేషన్ దుకాణం, అంగన్‌వాడీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ ఈఈ పాండురంగారావు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్‌సాగర్, తహసీల్దార్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు, కాంట్రాక్టర్లు, తదితరులు ఉన్నారు.

రోడ్లు బాగుంటేనే అభివృద్ధి..

రోడ్లు బాగుంటేనే రవాణా రంగం అభివృద్ధి చెందుతుందని ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. శనివారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌తో కలిసి నియోజకవర్గంలో రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేపట్టిన బీటీ రెన్యువల్స్‌పై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్లు భవనాలు శాఖ ద్వారా 32 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు పునరుద్ధరణకు 8 పనులు మంజూరైనట్టు చెప్పారు. ఇందులో కేవలం ఒక పనికి మాత్రమే టెండర్ వచ్చిందని, మిగతా వాటికీ కూడా టెండర్లు మరోమారు పిలిచి పనులు మొదలు పెట్టేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారుల నిర్వహణ, తదితర వాటి కింద 28 పనులకు సంబంధించి ఇప్పటివరకు టెండర్ రాని వాటికి మరోమారు ఆహ్వానించాలని సూచించారు.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల పరిశీలన



అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శైలేశ్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం జెడ్పీ సీఈఓ శైలేశ్ పరిశీలించారు. రాంపూర్, పోతంశెట్టిపల్లి గ్రామ పరిధిలోని నర్సాపూర్– మెదక్ జాతీయ రహదారి, ఏడుపాయల వన దుర్గాదేవి సన్నిధికి వెళ్లే రహదారి వెంట ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. మొక్కల పెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. అనంతరం రాంపూర్‌లో గ్రామ నర్సరీతో పాటు వైకుంఠధామాన్ని పరిశీలించి పరిసర ప్రాంతాల్లో నీడనిచ్చేలా మొక్కలు నాటాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. జెడ్పీ సీఈఓ వెంట ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఏపీఓ మహిపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విఠల్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలాజీ ఉన్నారు.

'ఆత్మీయ సమ్మేళనం' జయప్రదం చేయండి



మాట్లాడుతున్న చంద్రాగౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో నేడు (ఆదివారం) జరిగే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై జయప్రదం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు రాజన్నగారి దుర్గారెడ్డి, నారన్నగారి దుర్గారెడ్డి, ముకుందరెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ ర్యాలీకి రెవెన్యూ ఉద్యోగుల సంఘం మద్దతు



ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

చిన్నశంకరంపేట(మెదక్): నేడు మెదక్‌లో సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెన్షన్ ర్యాలీకి రెవెన్యూ ఉద్యోగుల సంఘం మద్దతు ప్రకటిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సీపీఎస్ ఎంప్లాయిస్ సంఘం జిల్లా సమన్వయకర్త కర్రోల్ల దేవయ్య ఆధ్వర్యంలో మహేందర్‌గౌడ్‌ను కలిసి మద్దతు కోరారు. అనంతరం ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ర్యాలీకి ఉద్యోగులు హాజరై మద్దతుగా నిలవాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎస్ ఎంప్లాయిస్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాజ్‌కుమార్, రియాజ్, శ్రీకాంత్, చంద్రయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్‌లో ఒక విద్యార్థికి సీటు ఖాళీగా ఉందని.. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 1వతేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందన్నారు. దరఖాస్తు ఫారం, పూర్తి వివరాల కోసం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మొబైల్ పోయిందా.. ఫిర్యాదు చేయండి

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: పోయిన మొబైల్‌ను తిరిగి పొందడానికి సీఈఐఆర్ అప్లికేషన్ ఎంతో దోహదపడుతుందని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని తెలిపారు. శనివారం మెదక్‌లోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అన్ని పోలీస్‌స్టేషన్లలోని సిబ్బందికి సీఈఐఆర్ అప్లికేషన్‌పై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోయిన ఫోన్లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందన్నారు. అయితే కొత్తగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన (సీఈఐఆర్) అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్ ఎక్కడ పోగొట్టుకున్న లేదా చోరీకి గురైనా వెతికి పట్టుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈసందర్భంగా అప్లికేషన్ పనిచేసే విధానాన్ని వివరించారు. మొబైల్ పోయిన వెంటనే తమ పరిధిలోని పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా ఎవరైనా పాత ఫోన్లు కొనే ముందు అప్లికేషన్‌లో ఆ ఫోన్ యొక్క ఐఎంఈఐ నంబర్ నమోదు చేసి చెక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఐటీ కోర్ టీం ఎస్ఐ మహిపాల్ రెడ్డి, ఐటీ కోర్ టీం సభ్యులు విజయ్, అనిల్, సయీద్, సతీష్ పాల్గొన్నారు.

నేడు పట్టణంలో తాగునీటి సరఫరా బంద్

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో ఆదివారం తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ జానకి రాంసాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగూర్ పాయింట్ వద్ద వాటర్ బెడ్స్ శుభ్రం చేస్తున్నందున నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

జిల్లా కోర్టులో లోక్ అదాలత్



కేసులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

మెదక్‌జోన్: జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి లక్ష్మీశారద ఎంవీఓపీ ఇన్సూరెన్స్, పీఎల్‌సీ కేసులను విచారించి రాజీ కుదిర్చారు. ఈసందర్భంగా ఇన్సూరెన్స్ కంపెనీ రూ. 23 లక్షల నష్ట పరిహారం చెల్లించారు. అలాగే బ్యాంకు కేసులపై లోక్ అదాలత్ నిర్వహించారు.

దివ్యాంగుల పింఛన్ పెంచాలి

మెదక్‌జోన్: దివ్యాంగుల పింఛన్ రూ. 10 వేలకు పెంచాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దివ్యాంగుల డిమాండ్ల చుట్టూ రాజకీయ పార్టీలు తిరిగే విధంగా బలమైన ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బస్వరాజు, కార్యదర్శి యశోద, ఆగమయ్య, తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ కార్యదర్శుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

మెదక్ కలెక్టరేట్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 12వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నామని.. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈనెల 28వ తేదీ వరకు ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులకు తమ సంఘం మద్దతు ఇస్తుందని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ (టీపీఎస్ఏ) జిల్లా అధ్యక్షుడే విఠ్యా నాయక్, ప్రధాన కార్యదర్శి నయీం తెలిపారు.

అగ్గి తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశాకుమారి



తెగులు సోకిన వరిని పరిశీలిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): వరికి అగ్గి తెగులు ఆశిస్తుందని రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశాకుమారి సూచించారు. శనివారం మండలంలోని లక్ష్మాపూర్ వద్ద వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని, ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులతో పంట చేలకు అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు, కంకి, నల్లి, పాముపడగ తెగులు సోకే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పొట్ట దశ నుంచి కోత దశలో పంటలు ఉన్నాయని తెలిపారు. తెగులు నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పురుగు మందు వాడాలని సూచించారు. ప్రస్తుతం అగ్గితెగులు ఉధృతి అధికంగా ఉందని పేర్కొన్నారు. ఇది తీవ్రమై వరి కంకిపై మెడ విరుపు తెగులుగా మారి అధిక నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. చీడపీడల నివారణకు గానూ ఆయా మండలాల్లో వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, విస్తరణ అధికారులు సాయికృష్ణ, తేజస్విని, రైతులు ఉన్నారు.

పాత వేబిల్లులతో ఇసుక వ్యాపారం



సీజ్ చేసిన ఇసుక కుప్పల వద్ద అధికారులు

రామాయంపేట(మెదక్): పాత వేబిల్లులతో అక్రమంగా ఇసుక వ్యాపారం కొనసాగిస్తున్న వారిపై రెవెన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో ఇసుక డంపులను సీజ్ చేశారు. పట్టణంలోని మూడు డంపుల్లో గత కొనేళ్లుగా ఇసుక అక్రమ వ్యాపారం కొనసాగుతుంది. ఈవిషయమై ఇటీవల పలు ఫిర్యాదులు రాగా రెండు శాఖల అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించి ఇసుక డంపులను సీజ్ చేశారు. మూడు చోట్ల సరైన ధ్రువ పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని డిప్యూటీ తహసీల్దార్ స్వప్న తెలిపారు. హనుమాన్ మోటార్ ఇండస్ట్రీస్, సాయిరాం బిల్డింగ్ మెటీరియల్స్ వద్ద 12 లారీల ఇసుక లోడ్, ప్రకాశ్ వద్ద ఐదు లారీల మేర ఇసుకను సీజ్ చేసినట్టు వెల్లడించారు. ఇద్దరి వద్ద ఇసుక అమ్ముకోవడానికి ఎలాంటి ట్రేడ్ అనుమతులు లేవని చెప్పారు. విచారణ అనంతరం పట్టుబడిన ఇసుకను వేలం వేస్తామని వెల్లడించారు. కాగా డంపుల వద్ద ఇసుక లోడుతో ఉన్న లారీని సైతం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



చెల్లాపూర్‌లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: వడగండ్ల వానతో పంటలు పూర్తిగా దెబ్బతిని నష్టపోయిన రైతులకు సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధి చెల్లాపూర్, మల్లాయపల్లి, బల్వంతాపూర్ గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంటను చూపిస్తూ.. ఏం ఆశ లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు ఫోన్ చేశారు. సర్వే చేసి పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. సుమారుగా 2,500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, మామిడి రైతులతో పాటు ఇళ్లు ధ్వంసం అయ్యాయని, బాధిత రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

దేశం చూపు.. తెలంగాణ వైపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, చిత్రంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



కళాకారుల విన్యాసాలు

ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం

కౌడిపల్లి(నర్సాపూర్): తెలంగాణలో జరిగిన అభివృద్ధిని దేశం మొత్తం చూస్తుందని ఎమ్మెల్సీ, పార్టీ ఆత్మీయ సమ్మేళన ఇన్‌చార్జి ఎగ్గే మల్లేశం అన్నారు. శనివారం కౌడిపల్లిలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ దేశవ్యాప్తంగా విస్తరిస్తుందన్నారు. రూ. లక్షల కోట్లు అప్పుతెచ్చిన బీజేపీ ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తల బలం, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమంతో రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. కాళేశ్వరం నీటితో పంటలు కళకళలాడుతున్నాయని.. కౌడిపల్లి మండలానికి త్వరలో కాళేశ్వరం నీళ్లు వస్తాయన్నారు. మంజీర, హల్దీ వాగుపై 14 చెక్‌డ్యాంలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. నియోజకవర్గంలో ప్రతి గిరిజన తండాకు రూ. 80 కోట్లతో బీటీ రోడ్లు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సార రామాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, జెడ్పీటీసీ కవిత అమర్‌సింగ్, ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్లం, ఆత్మ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, గొర్రె వెంకట్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రాయిలాపూర్ సర్పంచ్ శేఖులు, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సున్నం సతీష్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్‌ఎంపీపై ఫిర్యాదు

నర్సాపూర్: తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దచింతకుంటకు చెందిన మహిళకు ఆర్‌ఎంపీ నరేందర్ వరుసకు బాబాయి. ఇంటికి వచ్చి ఫోన్ నంబర్ ఇవ్వాలని అడగడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. శనివారం ఉదయం భర్త ఇంట్లో లేనిసమయంలో నరేందర్ మహిళ ఇంటికి వచ్చి ఫోన్ నంబర్ అడగితే ఆమె ఇవ్వనని చెప్పడంతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె తిట్టడంతో వెళ్లిపోయాడు. భర్త ఇంటికిరాగానే విషయ చెప్పింది. సుమారు ఐదేళ్ల క్రితం ఇలాగే ప్రవర్తించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తనతో పాటు తన కుటుంబ సభ్యులకు నరేందర్‌తో ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐని కోరింది. ఈ విషయంపై ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

సివిల్ సప్లయి గోడౌన్‌పై విజిలెన్స్ దాడులు

తూప్రాన్: పేదలకు పంపిణీ కావల్సిన రేషన్ బియ్యం నిల్వల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం గుర్తించారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని సివిల్ సప్లయి గోడౌన్‌పై విజిలెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో 4,743 క్వింటాళ్ల బియ్యం నిల్వల్లో తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.1.50 కోట్లు ఉంటుందన్నారు. కొన్నేళ్లుగా గోడౌన్ ఇన్‌చార్జిలు పనిచేసిన వారిని అదుపులోకి తీసుకొని విచారించనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరులోని తమ ప్రధాన కార్యాలయానికి సోమవారం రావాలని ఆదేశించామన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలోనూ సివిల్ సప్లయి గోడౌన్‌లో అక్రమాలు జరిగిన ఘటనలో ఇన్‌చార్జిలపై అధికారులు వేటు వేసిన సంఘటనలు ఉన్నాయి. అయిన అధికారుల తీరులో మార్పు రాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వన్యప్రాణుల విలవిల

- తాగునీటి కోసం తండ్లాట
- అటవీప్రాంతంలో సాసర్‌పిట్లు, చెక్‌డ్యాంలు ఖాళీ
- నీటి కోసం గ్రామాల్లోకి చొరబడే అవకాశం
- నిధులు రావడంలేదని చేతులెత్తేసిన అటవీశాఖ



పర్వతాపూర్ బీట్‌లో ఖాళీగా సాసర్ పిట్

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఈవేసవిలో వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే విషయమై ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఫలితంగా అవి తాగునీటికోసం అలమటిస్తున్నాయి. దంతేపల్లి, పర్వతాపూర్ అటవీప్రాంతంలో పర్యటించిన విలేకరులకు ఖాళీగా ఉన్న సాసర్‌పిట్లు అగుపించాయి. వివరాలు ఇలా ఉన్నాయి.

- జిల్లా పరిధిలో 58 వేల హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 400 పైగా సాసర్‌పిట్‌లు, చెక్‌డ్యాంలు, కుంటలు ఉన్నాయి.
- వేలాది వన్యప్రాణులు అటవీప్రాంతంలో మనుగడ సాగిస్తున్నాయి. ఏటా వేసవిలో వాటికి తాగునీటి వసతి కల్పించడానికి ఆశాఖ అధికారులు మార్చి మొదటి నుంచే సాసర్ పిట్లు, కుంటల్లో నీరు నింపే చర్యలు తీసుకుంటారు. దీంతో వణ్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా ఉంటాయి.
- గతంలో నీటివసతి కల్పించకపోవడంతో గ్రామాల్లోకి వచ్చి మృత్యువాత పడిన ఉదంతాలు ఉన్నాయి.
- ఐదేళ్ల క్రితం చిరుతలు అడవిని దాటి గ్రామాల్లోకి చొరబడి పశువులపై దాడి చేయడంతో మృత్యువాతపడ్డాయి.
- నీటికోసం అడవి నుంచి వస్తున్న వన్యప్రాణులు ప్రమాదాల బారినపడుతున్నాయి.
- ఐదేళ్ల క్రితం మండల పరిధిలోని కాట్రియాల తండాను ఆనుకునే ఉన్న అటవీప్రాంతంలో జంతువులకు తాగునీటికోసం వసతి కల్పించకపోవడంతో దాహంతో అలమటిస్తూ పదుల సంఖ్యలో వణ్యప్రాణులు మృత్యువాత పడ్డ సంఘటనను «సాక్షి» బయటపెట్టింది.
- దీంతో ఆశాఖ అధికారులు అదనంగా సాసర్ పిట్‌లతోపాటు చెక్‌డ్యాంలు నిర్మించారు. తాజాగా శుక్రవారం సాక్షి ప్రతినిధులు మండల పరిధిలోని దంతేపల్లి, పర్వతాపూర్ అటవీప్రాంతంలో పర్యటించారు.
- ఖాళీగా ఉన్న సాసర్‌పిట్లు కనిపించాయి. వాటిలో చుక్కనీరు కూడా లేకపోగా, చెత్తాచెదారంతో నిండిపోయాయి.
- వీటిని నీటితో నింపితే జంతువులకు తాగునీటి సదుపాయం కలుగుతుందని, లేకపోతే అవి గ్రామాలకు వచ్చే అవకాశం ఉందని ఆయాగ్రామాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో సక్రమంగా చెక్‌డ్యాంలు, సాసర్‌పిట్‌లతో నీరు నింపాం. నిధుల కొరతతో ఈసారి కొంత ఆలస్యం జరిగింది. త్వరలో అటవీప్రాంతంలో వణ్యప్రాణులకు పూర్తిస్థాయిలో నీటి వసతి కల్పిస్తాం.

– రవిప్రసాద్, జిల్లా అటవీ అధికారి

రేషన్ బియ్యం పట్టివేత

- హైదరాబాద్ కాటేదాన్ నుంచి గుజరాత్ తరలిస్తున్న వైనం
- విశ్వసనీయ సమాచారంతో పట్టుకున్న సివిల్ సప్లయి అధికారులు, పోలీసులు
- రెండు లారీల్లో తరలిస్తున్న 610 క్వింటాళ్ల రేషన్ బియ్యం



రేషన్ బియ్యం లారీని సీజ్ చేసిన అధికారులు

పటాన్‌చెరు టౌన్: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని రాజస్థాన్ జోద్‌పూర్ డాబా వద్ద జరిగింది. సివిల్ సప్లయి డీటి(డిప్యూటీ తహసిల్దార్) సురేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ రాజేంద్రనగర్ కాటేదాన్ నుంచి గుజరాత్ కు రెండు లారీల్లో అక్రమంగా సుమారు 610 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయి అధికారులు, పోలీసులు సంయుక్తంగా పటాన్‌చెరు మండలం రుద్రారం జోధ్‌పూర్ డాబా వద్ద జీజె 32 వీ 9925 లారీ, జీజె 03 బీవై 9407 లారీలను పట్టుకున్నారు. పట్టుకున్న రెండు లారీలను సీజ్ చేసి, రేషన్ బియ్యాన్ని అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు పటాన్‌చెరు ఎంఎల్‌ఎస్ గోదాముకు తరలించారు. ఆరుగురిపై కేసునమోదు చేశారు. లారీ డ్రైవర్లు మోరి సామత్, ముక్వన రాజు భాయ్‌ని అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుభాశ్ గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామ శివారులోని నల్లకుంటలో వెల్దుర్తి గ్రామానికి చెందిన ఎరుకలి భిక్షపతి(40) నీటమునిగి మృతిచెందాడు. తమ్ముడి పిల్లలను చూడడానికి వెళ్లి మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదం నెలకొంది. కుంటలో చేపలు పట్టడానికి వెళ్లి మృతిచెందాడా లేక స్నానానికి వెళ్ళి చేపలకోసం జాలరులు వేసిన వల చుట్టుకొని మృతిచెందాడా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

చేపల కోసం విసరిన వలలో చిక్కి..

చిన్నశంకరంపేట(మెదక్): చేపల కోసం విసరిన వలలో చిక్కుకుని మత్స్యకారుడు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని టి.మాందాపూర్ గ్రామంలో జరిగింది. శనివారం చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టీ.మాందాపూర్ గ్రామానికి చెందిన మాడబోయిన నర్సింహులు(45) శనివారం తెల్లవారుజామున పెద్దచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం విసిరిన వలలో చిక్కుకుని చెరువులో మునిగి మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహాయంతో చెరువులో గాలించి నర్సింహులు మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒక చేతిలో స్టీరింగ్.. మరొక చేతిలో పావురం..

- జాతీయ రహదారిలోని గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- తప్పిన పెను ప్రమాదం



గుంతలో దిగబడిన బస్సు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఒక చేతిలో పావురాన్ని పట్టుకొని, మరో చేతితో బస్సును నడపటంతో అదుపు తప్పి బస్సు జాతీయరహదారి పక్కన ఉన్న గుంతలోకి దూసుకు పోయింది. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం రామచంద్రాపురం పట్టణంలోని గండమ్మ ఆలయం సమీపంలో జరిగింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌సీయు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరుకు వస్తోంది. బస్సు వస్తున్న క్రమంలో కేపీహెచ్‌బీ వద్ద ఓ పావురం బస్సుకు ఎదురుగా వచ్చింది. దాంతో బస్సు డ్రైవర్ దస్తగిర్ బస్సును ఆపి ఆ పావురాన్ని పట్టుకోమని ఓ ప్రయాణికుడికి చెప్పాడు. అతడు పావురాన్ని పట్టుకొని బస్సులో కూర్చున్నాడు. ప్రయాణికుడు లింగంపల్లిలో బస్సు దిగుతూ ఆ పావురాన్ని డ్రైవర్ దస్తగిరికు ఇచ్చాడు. లింగంపల్లి నుంచి జ్యోతినగర్ వరకు జాతీయ రహదారిపై ఫ్లయిఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా గండమ్మ ఆలయం సమీపంలో రోడ్డు పక్కన పెద్ద గుంత తవ్వారు. ప్రమాదాలు జరగకుండా సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. డ్రైవర్ బస్సును కొంచెం వేగంగా నడపటంతో అదుపు తప్పి సిమెంట్ దిమ్మెలను ఢీకొని గుంతలోకి దూసుకు పోయింది. ఆ సయంలో బస్సులు సుమారు 30 మంది ప్రయాణికులున్నారు. అందరు స్వల్పగాయలతో బయట పడారు. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఆటోల్లో వెళ్లిపోయారు. దీంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న అజారుద్దీన్, పక్కన కత్తి కార్తీక

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ అన్నారు. శనివారం దుబ్బాకలో కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో మాట్లాడారు. తెలంగాణలో నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొత్త దేవిరెడ్డి, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ తదితరులు ఉన్నారు.

మూడు ట్రాక్టర్లకు నిప్పుపెట్టిన దుండగులు

- పొలం పనుల తర్వాత గ్రామ శివారులో ఉంచిన ట్రాక్టర్లు
- తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

మెదక్ రూరల్: మూడు ట్రాక్టర్లకు గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టిన సంఘటన మెదక్ మండలం మల్కాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపూర్ తండాలోని పరమేశ్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు, గోపాల్‌కు చెందిన ట్రాక్టర్‌ను శనివారం సాయంత్రం పొలం పనులు పూర్తయని తరువాత రాయిన్‌పల్లి శివారు ఎరుకల ఎల్లవ్వ పొలంలో ఉంచి ఇంటికి వెళ్లారు. అదే రోజు రాత్రి 1.30 గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్లకు నిప్పు పెట్టారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడి రిమాండ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ అక్రమ వినియోగం కేసులో గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామస్తుడికి రిమాండ్ విధించినట్లు సిద్దిపేట విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు శనివారం తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వడ్డెర ఎల్లంపై మార్చి 13వ తేదీన విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. శనివారం సిద్దిపేట కోర్టులో హాజరు పరుచగా, కోర్టు ఉత్తర్వుల మేరకు జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు తెలిపారు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మెదక్ రూరల్: హవేళిఘణాపూర్ మండలం బోగుడ భూపతిపూర్ చెరువులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులోని చెరువులో మృతదేహం ఉన్నట్లు గమనించిన పశువుల కాపరులు సర్పంచ్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అయ్యో 'పాప'ం

- రోడ్డు పక్కన అప్పుడే పుట్టిన ఆడశిశువు
- వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఐసీడీఎస్, పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు
- సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి శిశువు తరలింపు



గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన ఆడశిశువు

పటాన్‌చెరు టౌన్: మానవత్వం రాను రాను మంటగలుస్తోంది. తల్లి పొత్తిళ్లలో వెచ్చగా నిద్రించాల్సిన పసిగుడ్డు అనాథగా మిగిలింది. అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలి వెళ్లారు. ఈ దయనీయ సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. బీడీఎల్ ఎస్‌ఐ సాయిలు, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ సల్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం క్యాసారం ఎస్సీ కాలనీలో అప్పుడే పుట్టిన ఆడశిశువు రోడ్డు పక్కన శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. చిన్నారి ఏడుపు విన్న స్థానికులు వెంటనే ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సల్మా, ఎస్‌ఐ సాయిలు సంఘటన స్థలానికి చేరుకొని శిశువును సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాప ఆరోగ్యంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ముగ్గురి అదృశ్యం



వసంత (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్య కనిపించడంలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఎస్‌ఐ ప్రసాద్ రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ డీఎస్ కాలనీకి చెందిన శ్రీధర్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 13వ తేదీన శ్రీధర్ డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా భార్య వసంత కనిపించలేదు. అంతేకాకుండా ఆమెకు సంబంధించిన వస్తువులు ఇంట్లో కనిపించలేదు. దీంతో భార్య కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. భార్య కనిపించడంలేదని శ్రీధర్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లి కనిపించడంలేదని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ భాస్కర్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 12వ తేదీన భాస్కర్ తల్లి లక్ష్మి ఇంట్లో గొడవపడి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. డీఎస్ కాలనీలో ఉండే పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఉంటుందని కుమారుడు భావించాడు. అక్కడికి వెళ్లగా తల్లి కనిపించలేదు. దీంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. తల్లి కనిపించడంలేదని కుమారుడు భాస్కర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.



మహేశ్ (ఫైల్)

నారాయణఖేడ్: గిరిజ బాలుర పాఠశాల విద్యార్థి కనిపించకుండా పోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలోని గిరిజ బాలుర గురుకులంలో 9వ తరగతి చదువుతున్న వై.మహేశ్(17) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం మామిడి కాయల కోసమని గురుకులం ప్రహరీదూకి వెళ్లి తిరిగి రాలేదని ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

ప్రిన్సిపాల్ నిలదీత

గురుకులంలో 9వ తరగతి విద్యార్థి మహేశ్ అదృశ్యం కావడంతో శనివారం సాయంత్రం అతడి కుటుంబీకులు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌ను నిలదీశారు. శుక్రవారం అదృశ్యమైతే తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తమ కుమారుడు అదృశ్యమయ్యాడని ఆరోపించారు.

గేదెను కట్టేయబోయి..

కిందపడి రైతు మృతి



చంద్రయ్య (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): గేదెను కట్టేసే క్రమంలో కిందపడి రైతు మృతి చెందాడు.ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన పుప్పాల చంద్రయ్య(52)కు భార్య బాల్‌లక్ష్మి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చంద్రయ్యకు బోధకాలు ఉండటంతో తరచూ జ్వరం వస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం చంద్రయ్య గేదెలను పొలం వద్ద కట్టేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో అతడి కోసం వెతికారు. పొలం వద్ద కిందపడి కనిపించాడు. గేదెను కట్టేసే క్రమంలో అది గుంజుకుపోవడంతో కింద పడి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

లారీ టైర్ పేలి వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: లారీ టైర్ పేలిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వెంకటరమణ నగర్ కాలనీకి చెందిన కృష్ణమూర్తి 65వ జాతీయ రహదారిపై సత్వార్ రాందేవ్ దాబా వద్ద టైర్ పంక్చర్ షాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి పంక్చర్ అయిన టైర్‌కు రిపేర్ చేసి లారీకి బిగిస్తున్నాడు. ఒక్కసారిగా టైర్ పేలి కృష్ణమూర్తి దూరంగా ఎగిరిపడ్డాడు. తీవ్రగాయాలైన ఆయనను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

ముగ్గురికి గాయాలు



గాయపడ్డ డ్రైవర్

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తిశివునూర్ వద్ద శనివారం కారు చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. బాధితులు విమానాశ్రయం నుంచి కామారెడ్డి జిల్లా కుప్రియాల్ గ్రామానికి వెళ్తుండగా జప్తిశివునూర్ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శ్రీరాంకు తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వారు తమ స్వగ్రామానికి వెళ్లిపోయారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని నార్సింగి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

బాలుడిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): బాలికను కిడ్నాప్ చేసిన కేసులో బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు శనివారం తెలిపారు. మండల పరిధి గోమారానికి చెందిన బాలిక(16)ను లచ్చిరెడ్డిగూడంకు చెందిన బాలుడు రెండు రోజుల క్రితం కిడ్నాప్ చేశాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఇద్దరు మైనర్లను గుర్తించడం జరిగిందని, బాలికను భరోసా కేంద్రానికి తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట సీపీ శ్వేత
- మూడు నేరాల వివరాలు మీడియాకు వెల్లడి

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండా ని సిద్దిపేట సీపీ శ్వేత అన్నారు. సిద్దిపేట పట్టణంలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి డబ్బులు పొగొట్టుకున్నారు. సీపీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ట్రేడింగ్ టెలిగ్రామ్ యాప్‌లో డబ్బులు పెట్టుబడిగా పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మబలికాడు. అది నమ్మిన బాధితుడు రూ.12వేలు ఆన్‌లైన్‌లో పెట్టుబడిగా పెట్టాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గ్రహించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

హోటల్‌లో రూమ్ కోసం..

పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బెంగుళూరులోని ఓ హోటల్‌లో రూమ్ బుక్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో హోటల్ నంబర్ వెతికాడు. ఆన్‌లైన్లో కనిపించిన నంబర్‌కు ఫోన్ చేయగా అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించాలని సూచించాడు. దీంతో బాధితుడు ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబర్‌కు రూ.19,010 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

ఆర్మీ జవాన్ పేరుతో ..

పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆర్మీ జవాన్ అంటూ పరిచయం చేసుకున్నాడు. అతడికి ఆయుర్వేద మందులు కావాలని డబ్బులు పంపిస్తానని నమ్మించాడు. బాధితుడు డబ్బులు వస్తాయని ఆశపడి సైబర్ నేరగాడు సూచించిన విధంగా పేటీఎం యాప్‌లో ఓటీపీ వివరాలు నమోదు చేయడంతో తన ఖాతా నుంచి రూ.12,999 డబ్బులు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బురిడీ

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెద్దమొత్తంలో నగదు పోగొట్టుకుంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రచనకి ఈనెల 8వ తేదీన వాట్సాప్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగం అంటూ మెసేజ్ రావడంతో లింక్ క్లిక్ చేసింది. దీంతో టెలిగ్రామ్ ద్వారా ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బాధితురాలు వారు చెప్పిన విధంగా వివరాలను నమోదు చేసింది. మెదట రూ.వెయ్యి నుంచి ఇన్వెస్ట్ చేస్తూ, వారు చెప్పిన విధంగా టాస్క్‌లు చేస్తూ, పలు దఫాలుగా మొత్తం రూ.8.35 లక్షల నగదును ఇన్వెస్ట్ చేసింది. ఇన్వెస్ట్ చేసిన నగదును ఒకేసారి డ్రా చేసుకోవచ్చని చెప్పి నమ్మబలికారు. కమీషన్ తో పాటు పెట్టిన నగదును ఇవ్వాలని బాధితురాలు అడగటంతో అతడె స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన రచన ముందుగా సైబర్ క్రైం లో ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.